# ఇంద్రియ నిగ్రహం



*బలవానింద్రియగ్రామో*

*విద్వాంసం నాపకర్షతి*

*బలవానింద్రియగ్రామో*

*విద్వాంసమపి కర్షతి*

***భావం:*** బలమైన ఇంద్రియ వ్యామోహం విద్వాంసుని లాగెయ్యలేదు.(కాదు కాదు) బలమైన ఇంద్రియ వ్యామోహం విద్వాంసుని కూడా లాగి వేస్తుంది.

వ్యాసమహర్షి వేదాలను విభజించి లోకానికి అందించాడు. అష్టాదశ పురాణాలను ప్రజల చేతిలో పెట్టినవాడు. ఎంతటి పండితుడైనా వినయాభరణ భూషితుడు. తన రచనలపై ఇతరుల అభిప్రాయాలకు విలువనిచ్చేవాడు.

ఒకసారి ఒక పండితుడు ఆయన ఆశ్రమానికి వచ్చాడు. మహర్షి తాను రచించిన దాన్ని చదివి వినిపిస్తున్నాడు. "బలవానింద్రియ గ్రామో విద్వాంసమపి కర్షతి" అని వ్యాసుడు చదవగానే పండితుడు ఫక్కున నవ్వాడు. ఆ నవ్వులో వెక్కిరింపు స్పష్టంగా వినిపించింది. మహర్షి చదవడం ఆపి తల ఎత్తి చూశాడు.

పండితుడు మరొక్కసారి నవ్వి " విద్వాంసుని కూడా బలమైన ఇంద్రియ వ్యామోహం లాగివేస్తుందన్నారు. విద్వాంసుడైన వాడికి అన్ని విషయాలూ తెలిసి ఉంటాయి. అంతటి వాడికి శరీర సుఖాలు అశాశ్వతాలనీ తుచ్ఛమైనవనీ తెలిసే ఉంటుంది. అటువంటి వాడిని ఇంద్రియ వ్యామోహం ఎప్పటికీ లాగలేదు. బలవానింద్రియ గ్రామో విద్వాంసం నాపకర్షతి అని మార్చడం అభిలషణీయం. బలమైనప్పటికీ ఇంద్రియ విషయాలు పండితులను రొంపిలోకి లాగలేవు." అన్నాడు.

మహర్షి " రేపు ఉదయం మీరే గ్రంథంలో మార్పు చేయండి. రాత్రి అయింది. మీకై కేటాయించిన కుటీరంలో శయనించండి. మా శిష్యులు మీకు ఏర్పాట్లు చేశారు." అన్నాడు. పండితుడు కుటీరంలో పులి చర్మం పరుచుకుని భగవన్నామస్మరణ చేస్తూ పడుకున్నాడు. కొద్దిగా మొదలైన వాన కుండపోతగా మారింది. కుటీర ద్వారం వద్ద " అయ్యా ఆడుదాన్ని అబలను. ఈ రాత్రికి ఆశ్రయం కోరుతున్నాను" అని వినిపించింది. పండితుడు దీపం తీసుకుని వెళ్ళి చూశాడు. గుమ్మంలో అమ్మాయి తడిసిపోయి చలికి ఒణికిపోతూ నిల్చున్నది. అతడు " అమ్మా లోపలకు రా" అని పిలిచి తన వద్ద నున్న కాషాయంబరాలు ఇచ్చాడు. ఆమె కుటీరంలోని రెండవ గదిలోకి వెళ్ళి శరీరమూ తల తుడుచుకుని కాషాయపు దుస్తులు ధరించి వచ్చింది.

ఆమెను చూసిన పండితుడికి కళ్ళు తిరిగాయి. కాషాయపు దుస్తులలో ఆమె కమలంలా ఉంది. చందమామ లాంటి ముఖమూ, సంపెగ వంటి నాసికా, దొండపండు వంటి పెదవులూ, తాచుపాము వంటి జడా ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఆమె అతని హృదయాన్ని గ్రహించిన దానిలా లోపల గదిలోకి వెళ్ళి తలుపులేసుకుని పడుకుంది.

పండితునికి కంటిపై కునుకు లేదు. జిహ్వ పై హరినామస్మరణ లేదు.హృదయంలో భగవంతుని రూపం లేదు. కోరిక కట్టలు తెంచుకుంది. గది తలుపువేసి ఉంది. రెండు గదుల మధ్యనున్న గోడను కష్టంమీద ఎక్కి రెండవ వైపుకి దూకాడు. " సుందరీ కరుణించు" అని ఆమెను దగ్గరగా లాక్కుని కళ్ళు తన్మయత్వంలో మూసుకున్నాడు.

మరుక్షణం ఉలిక్కిపడ్డాడు. కౌగిలిలో ఉన్నది నల్లనివాడు, ఎర్రని కళ్ళవాడు, జటావల్కలధారి వ్యాసమహర్షి "సుందరాంగి ఏదీ?"

పండితుడు మహర్షి కాళ్ళపై పడ్డాడు. " మహానుభావా క్షమించండి. తమ రచనలో తప్పు వెతికిన పాపాత్ముణ్ని. ఇంద్రియ వ్యామోహం ఎంతటి వాడినైనా ఎంత విద్వాంసుణ్ణైనా తప్పకుండా లాగి పడేస్తుంది. నిగ్రహ సాధనకై ప్రయత్నిస్తాను." మహర్షి చిరునవ్వు నవ్వి పండితుణ్ణి లేవనెత్తారు.

******